డైనమిక్
# జనం వాయిస్
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
RNI NO: TGTEL/26/A0383
WWW.JANAMVOICE.COM
ఈ పేపర్ కోసం స్కాన్ చేయండి

విలేకరులు కావలెను..
రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనాత్మకమైన వార్త కథనాలతో వెలువడుతున్న డైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక కు విలేకరులు కావలెను.అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత... కొత్త వారికి అవకాశం..
సంప్రదించండి: 8121158069

| పెద్దపల్లి | శనివారం | 07 -02 -2026 | సంపుటి: 01 | సంచిక : 20 | పేజీలు : 08 | వెల :02/- |
|---|---|---|---|---|---|---|
| Peddapalli | Saturday | 07 -02-2026 | Volume: 01 | Issue: 20 | Pages: 08 | Cost :02/- |



2
## షియా మసీదుపై బాంబు దాడి.



2
## నౌకలో భారత నేవీ అధికారి అదృశ్యం

# రేవంత్ రెడ్డి 'తిట్ల ట్రాప్'లో పడొద్దు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు.
- ప్రజా సమస్యలపైనే సమరం చేయాలి.
- కాంగ్రెస్ వైఫల్యాలు, హామీల మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి.
- మున్సిపల్ ఎన్నికల్లో ప్రభుత్వాన్ని నిలదీయాలి.



**జనం వాయిస్, హైదరాబాద్:**
ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పన్నుతున్న 'తిట్ల ట్రాప్'లో ఎవరూ పడవద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల వేళ తన ప్రభుత్వ వైఫల్యాలు, హామీల అమలులో జరిగిన మోసాన్ని కప్పిపుచ్చుకోవడానికే రేవంత్ రెడ్డి తిట్ల రాజకీయాన్ని తెరపైకి తెచ్చారని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం తెలంగాణలో ఒక వికృత రాజకీయ క్రీడ నడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సాధన కోసం పద్నాలుగేళ్ల సుదీర్ఘ పోరాటం చేసి, ఢిల్లీ పీఠాన్ని గడగడలాడించిన నాయకుడు కె. చంద్రశేఖర్ రావు అని కేటీఆర్ గుర్తు మిగతా 2 లో...


## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారంకు పవన్ కళ్యాణ్ వెనకడుగు

- అనివార్య కారణాలతో ప్రచారం రద్దు.
- పవన్ వ్యాఖ్యలపై బీజేపీలో అసంతృప్తి.
- జనసేన వల్ల లాభం కంటే నష్టం ఎక్కువన్న అంచనా.

**జనం వాయిస్, హైదరాబాద్:**
తెలంగాణలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టాల్సిన ప్రచారాన్ని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ రద్దు చేసుకున్నట్లు సమాచారం. కొన్ని అనివార్య కారణాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవల కోనసీమకు తెలంగాణ దిష్టి



మిగతా 3 లో...



## కానిస్టేబుల్ కుటుంబానికి రూ.కోటి సాయం

- ప్రమోద్ భార్య ప్రణీతకు చెక్కు అందజేసిన సీఎం రేవంత్ రెడ్డి.

**జనం వాయిస్, నిజామాబాద్:**
గతేడాది విధి నిర్వహణలో దుండగుల కత్తిపోటుకు గురై ప్రాణాలు కోల్పోయిన పోలీస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ. 1 కోటి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. 'ప్రజా పాలన ప్రగతి బాట' కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదికగా ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈ సహాయాన్ని మిగతా 3 లో...

## హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి మహానగరంగా
# తీర్చిదిద్దడమే లక్ష్యం



- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.
- నగర అభివృద్ధికి రూ. 20 వేల కోట్ల కేటాయింపు.
- 27 పట్టణ స్థానిక సంస్థల జీహెచ్ఎంసీలో విలీనం.
- హెచ్-సిటీ ప్రోగ్రామ్‌తో ఫ్లైఓవర్లు, రహదారుల విస్తరణ.
- పర్యావరణ పరిరక్షణ, జీవన ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి.

**జనం వాయిస్, హైదరాబాద్:**
హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి మహానగరంగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. ఈ దిశగా గత రెండు సంవత్సరాల్లోనే రికార్డు స్థాయిలో రూ. 20,000 కోట్లను నగర అభివృద్ధికి కేటాయించామని తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఇంత భారీ మొత్తంలో నిధులు కేటాయించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న 27 పట్టణ స్థానిక సంస్థలను జీహెచ్ఎంసీలో విలీనం చేయడం ద్వారా ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో సమగ్ర ప్రణాళికతో కూడిన మిగతా 3 లో...

## వ్యవసాయం దేశానికే ఆదర్శం

- నిజామాబాద్ లో అభివృద్ధి పనులకు భారీ ఊతం.
- ప్రజాపాలనప్రగతి బాట సభలో ప్రసంగం.
- రూ.600 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లకు సీఎం శంకుస్థాపన.
- నిజామాబాద్ వ్యవసాయం దేశానికే ఆదర్శం





**జనం వాయిస్, నిజామాబాద్:**
నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గానికి రూ.200 కోట్ల చొప్పున మొత్తం రూ.600 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ స్కూళ్ల ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం తెలిపారు. మిగతా 3 లో...

## గద్దర్ ఫిలిం అవార్డుల స్క్రీనింగ్‌కు శ్రీకారం

- ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రారంభమైన అవార్డుల ఎంపిక ప్రక్రియ.
- ఉగాది పర్వదినాన ఘనంగా గద్దర్ ఫిలిం అవార్డుల వేడుక.
- హైదరాబాద్‌ను గ్లోబల్ సినీ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం.

3



## మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



3

## కాంగ్రెస్ పాలనపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు



- మాజీ మంత్రి విస్తృత పర్యటన.
- కేసీఆర్ పాలనకాంగ్రెస్ పాలన తేడా వివరించిన నేత.
- పెన్షన్లు, సంక్షేమ పథకాలపై ఆగ్రహం.
- మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు కోరిన పిలుపు.

3

# ఎడిటోరియల్

## సంపాదన పెరిగినా సంతోషం ఎందుకు తగ్గుతోంది?

### – ఆర్థిక అభివృద్ధి మధ్య మానసిక ఖాళీకి కారణాలు ఏమిటి?

*జనం వాయిస్, ఎడిటోరియల్*

ఒకప్పుడు నెల జీతం పెరిగితే ఆనందం పెరిగేది. నేడు ఆదాయం పెరుగుతున్నా, మనసులో సంతృప్తి తగ్గుతున్నట్లు అనిపిస్తోంది. పెద్ద ఇళ్లు, ఖరీదైన వాహనాలు, చేతిలో ఆధునిక సౌకర్యాలు ఉన్నప్పటికీ, మనసు మాత్రం ప్రశాంతంగా ఉండటం లేదు. సంపాదన పెరుగుదలతో పాటు సంతోషం కూడా పెరగాలి అన్న సహజ భావన ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఈ విరుద్ధ పరిస్థితి వెనుక ఉన్న కారణాలను సమాజం లోతుగా ఆలోచించాల్సిన అవసరం ఉంది.

ఆర్థిక స్థితి మెరుగుపడటంతో పాటు మన జీవితాలు మరింత వేగంగా మారాయి. ఉద్యోగ ఒత్తిళ్లు పెరిగాయి. పోటీ తీవ్రమైంది. ఎక్కువ సంపాదించాలనే తాపత్రయం మనిషిని నిరంతర పరుగులోకి నెట్టేస్తోంది. ఈ పరుగులో కుటుంబానికి సమయం లేదు, స్నేహానికి చోటు లేదు, తనకు తాను ప్రశ్నించుకునే క్షణాలు లేవు. ఫలితంగా సంపాదన ఉన్నా, మనసు ఖాళీగా మారుతోంది.

సంతోషాన్ని మనం క్రమంగా వస్తువులతో కొలవడం మొదలుపెట్టాం. ఎంత సంపాదిస్తే అంత సంతోషం అన్న భావన మన ఆలోచనల్లో బలంగా నాటుకుపోయింది. కానీ ఈ ఆలోచనే మన అసంతృప్తికి మూలం అవుతోంది. ఎందుకంటే మనకంటే ఎక్కువ ఉన్నవారితో పోల్చుకోవడం, ఎప్పుడూ ఇంకేదో కావాలన్న భావనను పెంచుతోంది. ఈ తులనాత్మక జీవితం మనకు ఉన్నదాన్ని ఆస్వాదించనివ్వకుండా చేస్తోంది. సంపాదన పెరిగేకొద్దీ బాధ్యతలు కూడా పెరుగుతున్నాయి. అప్పులు, ఖర్చులు, భవిష్యత్తుపై భయాలు మనసును వెంటాడుతున్నాయి. ఒక స్థాయికి చేరుకున్నాక విశ్రాంతి దొరుకుతుందన్న ఆశ, ఆ స్థాయి చేరిన తర్వాత కూడా నెరవేరడం లేదు. ఎందుకంటే ఆశలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఈ అంతులేని ఆశలే సంతోషానికి అడ్డుగోడగా మారుతున్నాయి.

కుటుంబ బంధాల విషయంలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. సంపాదన కోసం ఎక్కువ సమయం పనికి కేటాయించడంతో, కుటుంబంతో గడిపే సమయం తగ్గిపోతోంది. ఒకే ఇంట్లో ఉన్నా, ప్రతి ఒక్కరూ తమ తమ ప్రపంచాల్లో మునిగిపోతున్నారు. మాటలు తగ్గుతున్నాయి, అనుబంధాలు పల్చబడుతున్నాయి. సంపాదన పెరిగినా, ఆ సంపాదనతో పంచుకునే ఆనందం మాత్రం తగ్గిపోతోంది.

సామాజిక జీవితం కూడా మారిపోయింది. ఒకప్పుడు స్నేహితులతో కలిసి గడిపే సమయం మనసుకు ఉత్సాహాన్ని ఇచ్చేది. ఇప్పుడు ఆ స్థానాన్ని ఒంటరితనం తీసుకుంటోంది. సంపాదన పెరిగినా, మనుషుల మధ్య దూరం పెరుగుతోంది. భావాలను పంచుకునే వేదికలు తగ్గిపోవడంతో, మనసులోని భారాన్ని మోసుకుంటూనే జీవించాల్సి వస్తోంది. సంతోషం అనేది కేవలం సంపాదనతో వచ్చే విషయం కాదన్న సత్యాన్ని సమాజం మరిచిపోతోంది. ఆరోగ్యం, ప్రశాంతత, బలమైన సంబంధాలు, ఆత్మసంతృప్తి ఇవన్నీ కలిసినప్పుడే నిజమైన సంతోషం లభిస్తుంది. కానీ మనం ఈ అంశాలను పక్కనపెట్టి, కేవలం ఆదాయంపైనే దృష్టి పెట్టడం వల్ల జీవితం అసమతుల్యంగా మారుతోంది. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే మన ఆలోచనల్లో మార్పు రావాలి. ఎంత సంపాదిస్తున్నామన్నదికంటే, ఎలా జీవిస్తున్నామన్నదే ముఖ్యమని గుర్తించాలి. మనకు ఉన్నదానిపై కృతజ్ఞత భావం పెంచుకోవాలి. కుటుంబానికి, స్నేహాలకు, మనసుకు సమయం కేటాయించాలి. అప్పుడే సంపాదనతో పాటు సంతోషం కూడా మన జీవితంలో స్థిరపడుతుంది.

మొత్తంగా సంపాదన పెరుగుతుండటం అభివృద్ధికి సంకేతమే. కానీ అదే అభివృద్ధి మనసుకు ఆనందం ఇవ్వకపోతే, ఆ అభివృద్ధి అసంపూర్ణమే. నిజమైన సంపద డబ్బులో కాదు, మనసు ప్రశాంతతలో ఉందన్న సత్యాన్ని సమాజం అర్థం చేసుకున్న రోజే, సంపాదనతో పాటు సంతోషం కూడా పెరుగుతుంది.

# రేవంత్ రెడ్డి 'తిట్ల ట్రాప్'లో పడొద్దు

మొదటిపేజీ తరువాయి... చేశారు. తండ్రిలా రాష్ట్రాన్ని అక్కున చేర్చుకుని, పాడుబడ్డ తెలంగాణను ప్రగతి బాటలో నడిపించిన మహోన్నత శిల్పి కేసీఆర్ గారని కొనియాడారు. కేసీఆర్ ఎప్పుడూ బిరుదులు, సన్మానాల కోసం పాకులాడలేదని, తెలంగాణ ప్రజల శ్రేయస్సే ఆయనకు నిజమైన గౌరవమని స్పష్టం చేశారు. ప్రస్తుతం అధికార గర్వంతో రేవంత్ రెడ్డి తన ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని దాచిపెట్టేందుకు కేసీఆర్ వ్యక్తిత్వంపై విషం చిమ్ముతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఇది ఒక వ్యక్తిపై మాత్రమే కాదు, తెలంగాణ ఉద్యమ చరిత్రపై జరుగుతున్న దాడిగా ఆయన అభివర్ణించారు. అందుకే పార్టీ శ్రేణులు ఎవరూ ఈ 'తిట్ల ట్రాప్'లో పడకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో చర్చ జరగాల్సింది వార్డుల మౌలిక వసతులు, రోడ్లు, డ్రైనేజీ, ఇంటింటికీ అందాల్సిన పథకాలపై కావాలని కేటీఆర్ అన్నారు. కానీ రేవంత్ రెడ్డి తన బూతు పురాణంతో అసలు చర్చను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రజల కన్నీటిని తుడిచే దిశగా బీఆర్ఎస్ పోరాటం సాగాలని, అబద్ధపు ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. ఎరువుల కోసం క్యూ లైన్లలో రైతులు పడుతున్న కష్టాలు, రైతు భరోసా అందక ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల చేతిలో నలుగుతున్న అన్నదాతల పరిస్థితిపై గొంతెత్తాలని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక చదువులు ఆగిపోతున్న విద్యార్థుల వేదనకు, గురుకులాల్లో విషాహారం తిని అల్లాడుతున్న పిల్లల పరిస్థితికి రేవంత్ రెడ్డే బాధ్యత వహించాలని ప్రశ్నించాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు, డీఏలు, పీఆర్సీ లేక నలిగిపోతున్న ప్రభుత్వ ఉద్యోగుల పక్షాన నిలబడాలని కేటీఆర్ కోరారు. సింగరేణి బొగ్గు స్కామ్, విద్యుత్ కుంభకోణాల వెనుక ఉన్న అసలు దొంగలెవరో ప్రజలకు వివరించాలని, నీటి వాటాను పక్క రాష్ట్రాలకు ధారాదత్తం చేస్తున్న రేవంత్ రెడ్డి 'కోవర్టు' ద్రోహాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రజల తీర్పే కేసీఆర్‌కు ఇచ్చే అసలైన గౌరవమని, పదేళ్ల ఉజ్వల ప్రగతి తర్వాత ఈ రెండేళ్లలో తెలంగాణ ఎదుర్కొంటున్న దుర్గతికి కారణాలను ప్రజల ముందుకు బలంగా తీసుకెళ్లాలని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ ఒక ధ్రువతార అని, ఆయన కీర్తి ఎప్పటికీ వెలుగుతూనే ఉంటుందని అన్నారు. చివరగా, రేవంత్ రెడ్డి అసమర్థ పాలనపై మున్సిపల్ ఎన్నికల్లో ప్రశ్నలను పిడుగుల్లా కురిపించాలని, ప్రజాస్వామ్యాన్ని కంటికి రెప్పలా కాపాడుకుందామని కేటీఆర్ తెలంగాణ ప్రజలకు పిలుపునిచ్చారు.



# షియా మసీదుపై బాంబు దాడి.

- 15 మంది మృతి, 80 మందికి పైగా గాయాలు.
- జుమ్మా ప్రార్థనల సమయంలో పేలుడు.
- తర్లాయ్ కలాన్ ప్రాంతంలోని ఖదీజతుల్ కుబ్రా మసీదు లక్ష్యం.
- ఆత్మాహుతి దాడి అనుమానం.
- రాజధానిలో భద్రత కట్టుదిట్టం.



**జనం వాయిస్, ఇస్లామాబాద్:**

పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్ మరోసారి బాంబు పేలుడుతో దద్దరిల్లింది. శుక్రవారం జుమ్మా ప్రార్థనల సమయంలో షియా మసీదును లక్ష్యంగా చేసుకుని జరిగిన భీకర దాడిలో కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోయారు. 80 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని స్థానిక అధికారులు ధృవీకరించారు. ఇస్లామాబాద్ ఆగ్నేయ ప్రాంతమైన తర్లాయ్ కలాన్‌లోని ఖదీజతుల్ కుబ్రా మసీదులో ఈ పేలుడు చోటుచేసుకుంది. శుక్రవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రార్థనలకు హాజరైన సమయంలో పేలుడు సంభవించడంతో ప్రాణనష్టం ఎక్కువగా జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించారు. నగరంలోని ప్రధాన ఆసుపత్రుల్లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ప్రాథమికంగా ఇది ఆత్మాహుతి దాడి అయి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. మసీదు ప్రధాన ద్వారం వద్ద దుండగుడు తనను తాను పేల్చుకున్నట్లు కొన్ని నివేదికలు పేర్కొన్నాయి. ఈ దాడిని పాకిస్తాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహ్సిన్ నఖ్వీ తీవ్రంగా ఖండిస్తూ, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనకు ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత వహించలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. గత ఏడాది నవంబర్‌లో ఇస్లామాబాద్ జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది మరణించిన విషయం తెలిసిందే. తాజా ఘటన నేపథ్యంలో రాజధానిలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

# నౌకలో భారత నేవీ అధికారి అదృశ్యం

**జనం వాయిస్, సింగపూర్/చైనా మార్గం:**

సింగపూర్ నుంచి చైనాకు ప్రయాణిస్తున్న నౌకలో భారత్‌కు చెందిన మర్చంట్ నేవీ అధికారి అదృశ్యమయ్యాడు. ఒడిశాకు చెందిన సార్థక్ మహాపాత్రో గత ఏడాది జులైలో ఒక ప్రైవేటు షిప్పింగ్ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. ప్రస్తుతం అతడు ప్రయాణిస్తున్న నౌక సింగపూర్ నుంచి చైనాకు తిరిగి వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఫిబ్రవరి 2న సార్థక్ తల్లిదండ్రులు, స్నేహితులతో వీడియో కాల్ ద్వారా మాట్లాడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే మరుసటి రోజు నుంచి అతడితో సంప్రదింపులు పూర్తిగా నిలిచిపోయాయి. పలుమార్లు ప్రయత్నించినా ఫోన్ కలవకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అనంతరం సార్థక్ కనిపించడం లేదని సంబంధిత షిప్పింగ్ కంపెనీ కుటుంబ సభ్యులకు అధికారికంగా తెలియజేసింది. నౌకలో అతడి జాడ లేకపోవడంతో వెంటనే గాలింపు చర్యలు ప్రారంభించినట్లు సమాచారం. నౌక సిబ్బంది, షిప్పింగ్ సంస్థతో పాటు సంబంధిత అధికారుల సహకారంతో అతడి కోసం శోధన కొనసాగుతోంది. ఈ ఘటనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. తన కుమారుడిని సురక్షితంగా త్వరగా కనుగొని స్వదేశానికి తీసుకురావాలని సార్థక్ తల్లి భావోద్వేగ విజ్ఞప్తి చేశారు. ఘటనపై మరిన్ని వివరాలు రావాల్సి ఉంది.



దినపత్రిక జనం వాయిస్ తెలుగు దినపత్రిక RNI NO:TGTEL/26/A0383 WWW.JANAMVOICE.COM

## మున్సిపల్ ఎన్నికల ప్రచారంకు పవన్ కళ్యాణ్ వెనకడుగు

మొదటిపేజీ తరువాయి... తగిలిందంటూ పవన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో తెలంగాణలో జనసేన భాగస్వామ్యం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉంటుందని బీజేపీలోని మెజార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ముఖ్యంగా ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ సమీకరణాలకు ఇబ్బందిగా మారుతాయన్న అభిప్రాయం వ్యక్తమైంది. ప్రస్తుతం హైదరాబాద్ నగరం, పరిసర ప్రాంతాల్లో మున్సిపల్ ఎన్నికలు జరగకపోవడం కూడా ఈ నిర్ణయానికి ఒక కారణంగా చర్చ జరుగుతోంది. పవన్ కళ్యాణ్ అభిమానులు, ఆంధ్ర మరియు కాపు సామాజిక వర్గ ఓటర్లు అధికంగా ఉండే ఈ ప్రాంతాల్లో ఎన్నికలు లేకపోవడంతో, జనసేన ప్రచారం వల్ల ఎలాంటి రాజకీయ ప్రయోజనం ఉండకపోగా నష్టమే జరిగే పరిస్థితి ఏర్పడిందన్న విమర్శలు వినిపించాయి. ఈ పరిణామాల నేపథ్యంలోనే పవన్ కళ్యాణ్ తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నుంచి వెనక్కి తగ్గినట్లు



రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

## హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి మహానగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి... సమతుల్య అభివృద్ధి సాధ్యమవుతుందని భట్టి విక్రమార్క అన్నారు. నగర విస్తరణకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను సమగ్రంగా అభివృద్ధి చేయడమే ఈ నిర్ణయ లక్ష్యమని తెలిపారు. హెచ్-సిటీ కార్యక్రమం ద్వారా రూ. 7,032 కోట్లతో ఫ్లైఓవర్లు, అండర్‌పాసులు, రహదారుల విస్తరణ పనులను వేగవంతం చేశామని వెల్లడించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, నగర రవాణా సౌకర్యాల మెరుగుదలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2047లో భాగంగా కేవలం మౌలిక సదుపాయాలే కాకుండా పర్యావరణ పరిరక్షణ, మెరుగైన జీవన ప్రమాణాలకు పెద్దపీట వేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా, అత్యంత నివసించదగిన నగరంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

## కానిస్టేబుల్ కుటుంబానికి రూ.కోటి సాయం

మొదటిపేజీ తరువాయి... అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు ప్రమోద్ భార్య ప్రణీత గారికి రూ. 1 కోటి చెక్కును అందజేశారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ప్రమోద్ త్యాగం ఎప్పటికీ మరచిపోలేమని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేసే పోలీస్ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం తెలిపారు. ఇలాంటి ఘటనల్లో బాధిత కుటుంబాలకు తక్షణమే సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వ్యవసాయం దేశానికే ఆదర్శం

మొదటిపేజీ తరువాయి... ప్రజాపాలన ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన ఆయన తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజల సహకారం అవసరమని కోరారు. ఈ సందర్భంగా ఇందూరు జిల్లా మహిళా సమాఖ్యకు చెందిన 1,614 స్వయం సహాయక సంఘాలకు రూ.200 కోట్ల బ్యాంక్ లింకేజీ చెక్కును సీఎం అందజేశారు. నిజామాబాద్ జిల్లా వ్యవసాయానికి మారుపేరని, ఇక్కడి రైతులు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని సీఎం పేర్కొన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడానికి, అవసరమైన అదనపు నిధులు మంజూరు చేయడానికి శాయశక్తులా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. జిల్లా అభివృద్ధికి నూటికి నూరు శాతం ప్రయత్నిస్తానని స్పష్టం చేశారు.

**- శంకుస్థాపన చేసిన ప్రధాన అభివృద్ధి పనులు**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు కీలక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తెలంగాణ యూనివర్సిటీ, డిచ్‌పల్లిలో రూ.20 కోట్లతో ఎస్సీ బాలురు, బాలికల హాస్టళ్ల నిర్మాణం, ఇందల్‌వాయిలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ సిబ్బంది నివాస గృహాలు, అదనపు సౌకర్యాల నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే తెలంగాణ యూనివర్సిటీలో రూ.8.60 కోట్లతో బాలికల హాస్టల్, రూ.1.36 కోట్లతో ఇండోర్ స్టేడియం, రూ.43 కోట్లతో ఆడిటోరియం, పరిపాలనా భవనం, సీఎస్‌ఈ భవనాల విస్తరణ పనులు, రూ.18 కోట్లతో నిర్మించిన సైన్స్ ల్యాబ్ ప్రారంభోత్సవం చేశారు. ఇదే విధంగా రూ.21 కోట్ల వ్యయంతో గాంధీనగర్‌బినోలా, పీడబ్ల్యూడీ & జేఎన్ఎన్ రోడ్డుసిరన్‌పల్లినిజాంపూర్ మార్గాల్లో రోడ్ల వెడల్పు పనులు చేపట్టనున్నారు. ఈ సభలో మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు

**జనం వాయిస్, సంగారెడ్డి:**

సంగారెడ్డి నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపాలిటీలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత టి. హరీశ్‌రావు విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో పదేళ్ల కేసీఆర్ పాలనను, గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు స్వయంగా చూస్తున్నారని ఆయన అన్నారు. ఇటీవల పంచాయతీ సెక్రెటరీలు, ఉద్యోగులు తనను కలిసి తమ బాధలు చెప్పుకున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఉద్యోగాలు ఇచ్చింది, శాశ్వతం చేసింది, జీతాలు పెంచింది కేసీఆర్‌నని, అయినా ఆయన్ను ఓడగొట్టి కాంగ్రెస్‌ను గెలిపించారని ఇప్పుడు వాళ్లే బాధపడుతున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి మాటలు నమ్మి మోసపోయామని ఉద్యోగులే చెబుతున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రూ. 200 ఉన్న పెన్షన్‌ను రూ. 2000 చేశారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రూ. 4000 ఇస్తామని చెప్పి మోసం చేసిందని హరీశ్‌రావు విమర్శించారు. గత 24 నెలల్లో ఒక్కో అవ్వతాతకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 52 వేల బాకీ పడిందని ఆరోపించారు. ఆత్తోడలికి రూ. 2500 ఇస్తామన్న హామీని కూడా నెరవేర్చలేదని అన్నారు. కేసీఆర్ కిట్, కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం హామీని కాంగ్రెస్ అమలు చేయలేదని, కేసీఆర్ ఇచ్చే లక్ష రూపాయల చెక్కులను కూడా నెలల తరబడి ఆపుతోందని మండిపడ్డారు. కేసీఆర్ రాకముందు ఇస్నాపూర్‌లో పవర్ హాలిడేస్ ఉండేవని, ఆయన హయాంలో 24 గంటల కరెంట్ రావడంతో పరిశ్రమల్లో పని చేసి ప్రజలు ఉపాధి పొందారని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ కరెంట్ కోతలు మొదలయ్యాయని అన్నారు. ఫ్రీ బస్సు పేరుతో ఆటో డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీశారని, మగవారిపై డబుల్ టికెట్ భారం మోపుతున్నారని విమర్శించారు. కేసీఆర్ తెలంగాణ కోసం ప్రాణాలకే తెగించిన నాయకుడని, అలాంటి వ్యక్తిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుచిత భాష ఉపయోగిస్తున్నారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బతుకమ్మ చీరలు, మైనార్టీ కానుకలు, రైతుబంధు, దళితబంధు, గొర్రెల పంపిణీ వంటి పథకాలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని విమర్శించారు. ఇస్నాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలకు అందుబాటులో ఉండే, భవిష్యత్తును కాపాడే నాయకులకు ఓటేయాలని పిలుపునిచ్చారు. ఇస్నాపూర్ అభివృద్ధి కొనసాగాలన్నా, పేదల సంక్షేమ పథకాలు తిరిగి రావాలన్నా కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని హరీశ్‌రావు ప్రజలను కోరారు.

## గద్దర్ ఫిలిం అవార్డుల స్క్రీనింగ్‌కు శ్రీకారం

**జనం వాయిస్, హైదరాబాద్:**

హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో గద్దర్ ఫిలిం అవార్డుల స్క్రీనింగ్ ప్రక్రియను ఈరోజు ప్రారంభించినట్లు ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క తెలిపారు. సామాజిక మార్పు కోసం కళను ఆయుధంగా మలిచిన ప్రజా యుద్ధనౌక గద్దర్ స్మారకార్థం నిర్వహిస్తున్న ఈ అవార్డులు రెండవ సంవత్సరంలోకి అడుగుపెట్టడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. వచ్చే ఉగాది పర్వదినం సందర్భంగా 'న భూతో న భవిష్యతి' అన్న భావనతో గద్దర్ ఫిలిం అవార్డుల వేడుకను ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి




తెలిపారు. ఈ వేడుక ద్వారా ప్రపంచ సినీ పరిశ్రమ దృష్టి మొత్తం హైదరాబాద్‌పై పడేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమతో పాటు అన్ని భాషల చిత్రాలకు హైదరాబాద్‌ను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని బట్టి విక్రమార్క పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారి సహకారంతో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, జ్యూరీ ఛైర్మన్ మణిశర్మ ఆధ్వర్యంలో గద్దర్ ఫిలిం అవార్డుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా కొనసాగుతుందని తెలిపారు. సినీ కళాకారులు, సాంకేతిక నిపుణులకు ఏ అవసరం వచ్చినా, అర్ధరాత్రి అయినా ప్రజా ప్రభుత్వ తలుపు తట్టవచ్చని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

- **రేవంత్ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు.**
- **ఓట్లతోనే రాజకీయ సమాధానం ఇవ్వాలన్న పిలుపు.**
- **కార్యకర్తలే నా బలం అంటూ స్పష్టం.**
- **భావోద్వేగంగా స్పందించిన మాజీ మంత్రి.**

**జనం వాయిస్, జగిత్యాల:**

జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపాయి. రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టాలని అన్నారని ఆరోపించిన జీవన్ రెడ్డి, తాను మాత్రం ప్రజాస్వామ్య మార్గంలో ఓట్లతోనే కొడదామని చెబుతున్నానని వ్యాఖ్యానించారు. తన గొంతును కొద్దామని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన ఆయన, తనను అణిచివేయాలంటే ముందు భుజాల్లాంటి తన కార్యకర్తలను దాటి రావాలని సవాల్ విసిరారు. కార్యకర్తలే తన అసలైన బలమని, వారి అండతోనే రాజకీయంగా ముందుకు సాగుతున్నానని తెలిపారు. ఈ సందర్భంగా భావోద్వేగానికి లోనైన జీవన్ రెడ్డి, "జీవితం ముగిసేలోపు నాకు తీవ్ర దుఃఖం మిగిల్చారు" అంటూ ఆవేదన వ్యక్తం



చేశారు. తనపై జరుగుతున్న రాజకీయ దాడులు వ్యక్తిగతంగా బాధిస్తున్నాయని అన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ప్రజలే తుది తీర్పు చెప్పాలన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు చోటు లేదని, ఎన్నికల ద్వారా సమాధానం ఇవ్వడమే సరైన మార్గమని మాజీ మంత్రి జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

## అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలి.

### - సహాయ కార్మిక అధికారి కే. హేమలత.

**జనం వాయిస్, పెద్దపల్లి:**

పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం -2013 ప్రకారం అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని సహాయ కార్మిక అధికారి కే. హేమలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని ప్రైవేటు, సంఘటిత అసంఘటిత రంగాలల్లో పని చేస్తున్నటువంటి మహిళలపై పని ప్రదేశాలల్లో లైంగిక వేదింపుల నివారణ కొరకు 10 మంది, అంతకు మించి పని చేస్తున్న అన్ని వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు, దుకాణ సముదాయాల లో చట్ట ప్రకారం అంతర్గత పిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని, పని ప్రదేశంలో మహిళల పై లైంగిక వేదింపుల నిరోధక చట్టం 2013 ప్రకారం, కమిటీ ఏర్పాటు చేసి అట్టి కమిటీ సభ్యుల పేర్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెబ్ పోర్టల్ http://shebol. tgwdcw.in నందు నమోదు చేయవలెను, లేనియెడల సంబంధిత సంస్థ యాజమాన్యానికి చట్ట ప్రకారం జరిమానా విధించడం జరుగుతుందని సహాయ కార్మిక అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## సిరిపురం లో ప్రత్యేక పశు వైద్య శిబిరం.

**జనం వాయిస్, మంథని:**

పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురం గ్రామంలో పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ,పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా పశు వైద్య పశు సంవర్ధక శాఖ పెద్దపల్లి జిల్లా వారి సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం (చీూా)ఏడు రోజుల కార్యక్రమంలో భాగంగా 6 వ రోజు మంథని మండలం. సిరిపురం గ్రామంలో ప్రత్యేక పశువైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ ప్రత్యేక పశు వైద్య శిభిరం లో జబ్బు పడిన 483 పశువులకు చికిత్స మరియు 182 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు (గాలికుంటు, ముద్దచర్మవ్యాధి మరియు రేబిస్ టీకాలు)చేయడం జరిగింది.అలాగే 22 పశువులకు చూడి పరీక్షలు,8 పశువులకు గర్భకోష వ్యాధులకు చికిత్స అందించడం జరిగింది. 330 దూడలకు నట్టల నివారణ మందులు 2 పశువులకు శస్త్ర చికిత్సలు నిర్వహించడం జరిగింది. అంతే కాకుండా పాడి పశు వుల,జీవాల యజమాన్య పద్దతులు,పశుపోషణ మరియు వివిధ రకాల పశు గ్రాసాలపై సాగు పై పాడి రైతులకు అవగాహన కల్పించడం జరిగింది.అని మంథని మండల పశువైద్య అధికారి డాక్టర్ టి.రవి కుమార్ వెల్లడించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.విజయ భాస్కర్,హైదరాబాద్ పశు వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ లత, డాక్టర్ డి.అనుష,డాక్టర్ ఎస్.ప్రత్యూష ,మరియు మేఘా నాయక్ ,పి.జి. మరియు యూ.జీ విద్యార్థులు సహాయక సిబ్బంది పాల్గొన్నారు. వారితో పాటు సిరిపురం సర్పంచ్ గోదారి లక్ష్మీ రాయమల్లు,ఉప సర్పంచ్ ఈసంపల్లి నారాయణ మరియు వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారి బి.హన్మండ్లు,వెంకన్న వాక్సీ నెటర్ అజయ్ గోపాలమిత్రాలు పానుగంటి సంజీవ్ కుమార్, కొండయ్య, రామకృష్ణ, మల్లేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తా

**జనం వాయిస్, మంథని:**

గ్రామ అభివృద్ధి కోసం నిత్యం కృషి చేస్తానని పోతారం గ్రామ సర్పంచ్ ఎడ్ల ఆదిత్య పేర్కొన్నారు. శుక్రవారం మంథని మండలం పోతారం గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన భూమి పూజను సర్పంచ్ ఆదిత్య నిర్వహించారు. తెలంగాణ ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో మంజూరు అయినటువంటి పంచాయతీ భవనానికి భూమి పూజ నిర్వహించడం చాలా ఆనందకరంగా ఉందని ఆయన పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో గ్రామాభివృద్ధికి నిత్యం చేస్తానని ఆయన తెలిపారు. గ్రామస్తులే నా దేవుళ్ళు, పంచాయతీ అభివృద్ధి నా ముఖ్యమని సర్పంచ్ ఆదిత్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దాసరి వెంకటస్వామి, పాలకవర్గ సభ్యులు దాసరి సతీష్, దాసరి ఈశ్వరి, వీణ , బోగిరి స్రవంతి, కుమార్, ఈసంపల్లి బాపు, బండి లిరిష్, సంతోష్, మహేందర్, నారాయణ, భూపతి, నరేష్, దాసరి రాములు, ముక్తేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ళ బేస్ మెంట్ లు పూర్తి చేయాలి.

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**
**- ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్.**

**జనం వాయిస్, పెద్దపల్లి:**



ఫిబ్రవరి 28 నాటికి ఇందిరమ్మ ఇళ్ళ బేస్ మెంట్ లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఇందిరమ్మ ఇండ్ల పురోగతి , డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీలో ఆర్&బీ, పంచాయతీ రాజ్, విద్యుత్, ఇతర శాఖల ద్వారా పెండింగ్ ఉన్న పనులు పూర్తి చేసుకొని హౌసింగ్ శాఖ జారీ చేసిన ఆదేశాల ప్రకారం రెండు శాఖల అధికారులు కలిసి జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి వివరాలను ఫిబ్రవరి 13 లోపు పీడీ హౌసింగ్ కార్యాలయం లో సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. బేస్ మెంట్ లు నిర్మాణం చేయని ఇందిరమ్మ ఇండ్లను ఫిబ్రవరి 28 నాటికి రద్దు చేయాలనీ కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించి త్వరగా బేస్మెంట్ వరకు పనులు జరిగేలా పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. నరేగా క్రింద 90 రోజుల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్న నేపథ్యంలో ప్రతి ఇందిరమ్మ ఇండ్ల పనులు నరేగా క్రింద నమోదు అయ్యేలా సంబంధిత ఎంపీడీవో, ఇతర మండల అధికారులతో సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు.ఇందిరమ్మ ఇండ్లకు స్వచ్ఛ భారత్ మిషన్ కింద వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేసిన వాటికి పేమెంట్ లు పూర్తి చేయాలని అన్నారు. రాబోయే ఏప్రిల్ నుంచి మరో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో మండలంలో వివిధ స్టేజీ లలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లు మార్చి నాటికీ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇండ్ల నిర్మాణానికి నిధులు లేని పక్షంలో మహిళా సంఘాల ద్వారా స్వయం సహాయక రుణాలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు ఆలస్యం జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో పీడీ హౌసింగ్ రాజేశ్వర్ రావు, ఈ ఈ ఆర్ &బి భావ్ సింగ్, ఎస్.ఈ.గంగాధర్, ఈ ఈ. శంకరయ్య,సంబంధిత హౌసింగ్ అధికారులు, తదితరులు పాల్గోన్నారు.

# ఎన్నికల కోడ్ పాటించని ప్రభుత్వ అంగన్‌వాడీ టీచర్

**- జమ్మికుంటలో అంగన్‌వాడీ టీచర్ బహిరంగ రాజకీయాలు.**

**జనం వాయిస్, జమ్మికుంట:**

మున్సిపల్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలోనూ ప్రభుత్వ వ్యవస్థ తటస్థతపై తీవ్ర సందేహాలు తలెత్తుతున్నాయి. జమ్మికుంట మున్సిపాలిటీ 17వ వార్డుకు చెందిన ప్రభుత్వ అంగన్‌వాడీ టీచర్ పుల్లూరి కవిత బీఆర్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఆమె పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతుండటంతో, నిబంధనలు అమలు అవుతున్నాయా లేదా అనే ప్రశ్నలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ ప్రచార కమిటీ సభ్యుడు సాయిని రవి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత టీచర్‌ను ప్రశ్నించగా, ఎన్నికల కోడ్‌ను పట్టించుకోకుండా స్పందించినట్లు కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయాలకు దూరంగా ఉండాల్సి ఉన్నా, ఇందుకు విరుద్ధంగా వ్యవహరించినట్లు ఆరోపణలు రావడం ప్రభుత్వ యంత్రాంగంపై విమర్శలకు దారితీస్తోంది. ముఖ్యంగా ఈ వ్యవహారంపై ఎన్నికల అధికారులు, శాఖాధికారులు స్పందించకపోవడం మరింత



అనుమానాలకు తావిస్తోంది. ఈ ఘటనపై తక్షణమే విచారణ చేపట్టి, తప్పిదం నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



- అదుపుతప్పి వంతెన గోడను ఢీకొన్న బస్సు

# తృటిలో తప్పిన పెను ప్రమాదం

**జనం వాయిస్, జమ్మికుంట:**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట లో బస్సు ప్రమాదానికి గురైంది. కాగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. హుజూరాబాద్ నుండి జమ్మికుంట వైపు వస్తున్న ఆర్టీసీ ఫ్లైఓవర్ వద్దకు రాగా ఒక్కసారిగా అదుపుతప్పి బస్సు జమ్మికుంట పట్టణంలోని వంతెన గోడను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పలువురికిస్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని అక్కడి స్థానికులు ఆసుపత్రికి తరలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎదురుగా వస్తున్న వాహన్నాన్ని తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి ప్రమాదం జరిగిందని ప్రమాదంలో గాయపడిన వారిని సురక్షితంగా బస్సులో నుండి బయటకు తీసామని ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారని, ఈ ప్రమాదం హెచ్చరికల బోర్డులు లేకపోవడంతో ప్రమాదం జరిగి ఉండవచ్చని ఓవర్ బ్రిడ్జి పై ఇంతకుముందు అనేక ప్రమాదాలు జరిగాయని అధికారులు ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం గమనార్హం అని అధికారులు స్పందించి ప్రమాద హెచ్చరిక సూచిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని స్థానికులు తెలిపారు.

RNI NO:TGTEL/26/A0383
దైనిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక
WWW.JANAMVOICE.COM

# కాంగ్రెస్ హామీలపై ప్రజలు ఆలోచించాలి

- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి.
- జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల ద ప్రచారంలో కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు.
- రెండేళ్లలో ఒక్క హామీ కూడా అమలు కాలేదని ఆరోపణ.
- మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే ఓటేయాలని పిలుపు.

**జనం వాయిస్, జమ్మికుంట:**

హుజురాబాద్ నియోజకవర్గం జమ్మికుంట పట్టణంలోని అబాది జమ్మికుంట గ్రామంలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల వార్డు స్థాయి సమావేశాల్లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జరిగిన ఈ సమావేశాల్లో ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు కాలేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. రైతుబంధు, తులం బంగారం, వృద్ధులకు రూ.4,000 పెన్షన్, వడ్లకు రూ.500 బోనస్, మహిళలకు రూ.2,500, బతుకమ్మ చీరలు వంటి హామీలు ఏవీ అమలుకాలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన మొత్తం బకాయిల పాలనగా మారిందని పాడి కౌశిక్ రెడ్డి అన్నారు.



రైతుబంధు, సన్న వడ్లకు బోనస్, ఫీజు రీయింబర్స్‌మెంట్, షాదీ ముబారక్, పెన్షన్లు వంటి అనేక బకాయిలు ఇప్పటికీ చెల్లించలేదని విమర్శించారు. రైతులు, కార్మికులు, నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం ఘోర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇంటింటికి వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకులను వారి హామీలపై ప్రజలు గట్టిగా ప్రశ్నించాలని, మాయమాటలు నమ్మవద్దని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. జమ్మికుంట పట్టణంలో 13వ, 14వ వార్డుల్లో నిర్వహించిన మున్సిపల్ వార్డు స్థాయి సమావేశాలు విజయవంతంగా జరిగాయని తెలిపారు. “మన తెలంగాణను కాపాడుకోవాలంటే, హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధి నిలబెట్టాలంటే, జమ్మికుంట అభివృద్ధి కొనసాగాలంటే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటు వేయాలి” అని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ ఎన్నికల ఇంచార్జ్, మాజీ జడ్పీ చైర్మన్ మారేపల్లి సుదీర్ కుమార్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సౌమ్య కుటుంబానికి రూ.1 కోటి పరిహారం

- విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయినద కానిస్టేబుల్‌కు ప్రభుత్వ అండ.
- బర్దిపూర్ సభ వేదికగా చెక్కు అందజేత.
- బాధిత కుటుంబానికి అండగా ప్రభుత్వం నిలుస్తుందన్న సీఎం.

**జనం వాయిస్, నిజామాబాద్:**

ఇటీవల విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.1 కోటి రూపాయల పరిహారాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అందజేశారు. ఈ చెక్కును సౌమ్య తల్లి సహా కుటుంబ సభ్యులకు సీఎం స్వయంగా అందించారు. ‘ప్రజా పాలన ప్రగతి బాట’ కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం బర్దిపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదికగా ఈ పరిహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజా సేవలో ప్రాణాలు కోల్పోయిన సౌమ్య త్యాగం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్న ముఖ్యమంత్రి, బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పరంగా ఇవ్వాల్సిన సాయం, మద్దతు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# స్టేషన్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి

- రఘునాథ్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన వరంగల్ సీపీ.
- నేరాల రేటు, కేసుల పురోగతిపై సమీక్ష.
- పెద్దపులి సంచారం నేపథ్యంలో అప్రమత్తతకు ఆదేశాలు.
- అధికారులుసిబ్బందికి స్పష్టమైన సూచనలు.

**జనం వాయిస్, వరంగల్:**

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శుక్రవారం రఘునాథ్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించి, రికార్డ్ రూమ్, స్టేషన్ రైటర్ రూమ్, రిసెప్షన్ సెంటర్‌తో పాటు ఇతర విభాగాలను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులను సక్రమంగా సంరక్షించుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం స్టేషన్ పరిధిలోని నేరాల రేటు, రోడ్డు ప్రమాదాలు, చోరీ కేసులు, నమోదైన కేసుల పురోగతిపై సీపీ ఆరా తీశారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులూ, సిబ్బంది పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలని సూచిస్తూ, విధి విధానాలపై సంబంధిత స్టేషన్ ఎస్ఐ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు స్పష్టమైన మార్గనిర్దేశం చేశారు. ప్రస్తుతం రఘునాథ్‌పల్లి మండలం మరియు పరిసర ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని సీపీ ఆదేశించారు. ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తినష్టం జరగకుండా అటవీ శాఖ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో ఘన్పూర్ ఏసీపీ భీమ్ శర్మ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రఘునాథ్‌పల్లి ఎస్ఐ నరేష్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

**జనం వాయిస్, హైదరాబాద్:**




మైలార్దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు రాజేంద్రనగర్ జోన్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లకు పలు కీలక సూచనలు చేశారు. కౌన్సెలింగ్‌లో భాగంగా చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, ప్రజలతో శాంతియుతంగా మెలగాలని డీసీపీ సూచించారు. రాత్రి వేళ అనవసరంగా తిరగకూడదని, బెదిరింపులు లేదా దోపిడీ చర్యలకు పాల్పడకూడదని స్పష్టం చేశారు. ప్రాంతంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే కార్యకలాపాల్లో పాల్గొంటే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయడం సహా కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే తమ ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చి, జీవనశైలిని సానుకూలంగా మార్చుకొని బాధ్యతాయుత పౌరులుగా జీవించాలని సూచించారు. కౌన్సెలింగ్ అనంతరం సంబంధిత రౌడీషీటర్లు భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ ఘటనల్లో పాల్గొనమని హామీ ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

# పదవ, ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత పెంచాలి

- ☐ మంత్రి పొన్నం ప్రభాకర్.
- ☐ గురుకులాల ప్రిన్సిపాళ్లు, హాస్టల్ అధికారులతో జూమ్ సమీక్ష.
- ☐ విద్యార్థుల సన్నద్ధతకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలి.
- ☐ ఉపాధ్యాయులు మరింత బాధ్యతగా పనిచేయాలని సూచన.

**జనం వాయిస్, హైదరాబాద్:**

ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో మహాత్మా జ్యోతిబాపూలే గురుకులాల పాఠశాలల విద్యార్థుల సన్నద్ధతపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకులాల ప్రిన్సిపాళ్లు, హాస్టల్ వెల్ఫేర్



ఆఫీసర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్న జూమ్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్, గురుకులాల కార్యదర్శి సైదులు, వివిధ గురుకులాల ప్రిన్సిపాళ్లు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవసరమైన అకడమిక్ మద్దతు, ప్రత్యేక తరగతులు, రివిజన్ ప్లాన్‌లు అమలు చేయడంపై విస్తృతంగా చర్చించారు. ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని గణనీయంగా పెంచాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఉపాధ్యాయులకు స్పష్టంగా సూచించారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, బలహీన అంశాలను గుర్తించి వ్యక్తిగత శిక్షణ అందించాలని చెప్పారు. గురుకులాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతగా పనిచేయాలని మంత్రి ఆదేశించారు. అలాగే విద్యార్థుల మానసిక ఒత్తిడిని తగ్గిస్తూ, పరీక్షలపై ధైర్యం కలిగించేలా కౌన్సెలింగ్, ప్రోత్సాహం అందించాలని, హాస్టళ్లలో చదువుకు అనుకూల వాతావరణం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

# అభివృద్ధి సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం.

- మంథని సమగ్రాభివృద్ధికి కట్టుబడి పని చేస్తం.
- పదేళ్లలో జరిగిన అభివృద్ధిపై ఆలోచన చేయండి.
- కాంగ్రెస్ అవకాశం ఇస్తే పాతరోజులే పునరావృతం.
- రెండేళ్లలో కాంగ్రెస్ పాలనతో జరిగిందేమీ లేదు.
- ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్.

**జనం వాయిస్, మంథని:**

బీఆర్ఎస్ పార్టీ అంటేనే సంక్షేమం..అభివృద్ధి అని మంథని మాజీఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బాగంగా శుక్రవారం మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా షాపింగ్ ఏరియా లో మరియు 4, 5, 6వ వార్డులు (గంగపూరి , లైన్ గడ్డ, కూచిరాజ్ పల్లి, శ్రీరామ్ నగర్, బోయిన్ పేట, గొల్లగూడెం) లో ఆయా వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు మరియు మంథని మున్సిపల్ మాజీ చైర్మన్ పుట్ట శైలజ తో కలిసి ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డుల్లో పర్యటించిన ఆయన ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ ఓట్లు





అభ్యర్థించారు. నాటి నుంచి నేటి వరకు మంథని సమగ్రాభివృద్ధికి కట్టుబడే ఉన్నామని, అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల సమస్యల పరిష్కారం కోసమే పనిచేస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో తాము అధికారంలో ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధిపై ప్రతి ఒక్కరు ఆలోచన చేయాలన్నారు. బడుగు బలహీనవర్గాలకు మేలు చేయాలనే ఆలోచనతోనే ముందుకు సాగుతున్నామని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే పాత రోజులే పునరావృతం అవుతాయని, అధికారం, పదవులు తప్ప ప్రజల సమస్యలు పట్టవన్నారు. ఇదివరకే కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోయి గోసపడుతున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఆనాడు మాయమాటలు చెప్పినోళ్లు మళ్లీ ఓట్ల కోసం వస్తున్నారని, ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ నిలదీయాలన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మంథనికి జరిగిన మేలు ఏమీ లేదనే విషయాన్ని గుర్తించాలని అన్నారు. మంథని అభివృద్ధికిబాటలు పడాలంటే బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురాలని, అవినీతికి ఆస్కారం లేని పాలన అందిస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఆదరించి ఆశీర్వదించాలని, మున్సిపాలిటిలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపుతోనే మార్పుకు బీజం పడాలని ఆయన ఈసందర్భంగా పిలుపునిచ్చారు.

# వేప పుల్ల దంత ఆరోగ్యానికి ప్రకృతి ఇచ్చిన ఔషధం



**జనం వాయిస్, ఆరోగ్యం:**

తరం తరాలుగా కొనసాగుతున్న సహజ దంత సంరక్షణ వేప పుల్లతో పళ్లు తోముకోవడం భారతీయ సంప్రదాయంలో అనాదిగా కొనసాగుతున్న అలవాటు. టూత్‌పేస్ట్‌లు లేని కాలంలోనే కాకుండా, ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో వేప పుల్లను దంత సంరక్షణకు ఉపయోగిస్తున్నారు. ఉదయం పరికడుపుతో వేప పుల్ల నమలడం నోటి శు భ్రతను కాపాడటంతో పాటు ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ప్రకృతిలోనే లభించే ఈ సాధనం తక్కువ ఖర్చుతో అందరికీ ఉపయోగపడే సంపదగా నిలుస్తోంది.

**- బాక్టీరియా నివారణలో వేప గుణాలు.**

వేపలో సహజ యాంటీబాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. వేప పుల్లతో పళ్లు తోముకోవడం వల్ల నోటిలోని హానికరమైన బ్యాక్టీరియా తగ్గి దంత క్షయం, పళ్ల పురుగు, దుర్వాసన వంటి సమస్యలు తగ్గుతాయని చెబుతున్నారు. చిగుళ్ల వాపు, రక్తస్రావం వంటి సమస్యల నివారణలో కూడా వేప పుల్ల ఉపకరిస్తుందని ఆయుర్వేదంలో ప్రస్తావన ఉందని పేర్కొంటున్నారు.

**- చిగుళ్లు బలపడటానికి సహాయం.**

వేప పుల్లను నమలడం వల్ల చిగుళ్లకు సహజ మసాజ్ లభిస్తుందని దంత వైద్యులు చెబుతున్నారు. దీని వల్ల రక్తప్రసరణ మెరుగుపడి చిగుళ్లు బలపడతాయని, పళ్లు ఊగిపోవడం వంటి సమస్యలు తగ్గుతాయని సూచిస్తున్నారు. రసాయనాలు కలిగిన టూత్‌పేస్ట్‌లతో పోలిస్తే వేప పుల్ల పూర్తిగా సహజమైనదని, దీర్ఘకాల వినియోగంలో దంతాలకు హాని తక్కువగా ఉంటుందని నిపుణుల అభిప్రాయం.

**- వినియోగంలో జాగ్రత్తలు అవసరం.**

వేప పుల్ల ఉపయోగకరమైనదైనా, సరైన విధానంలో వినియోగించాల్సిన అవసరం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



పుల్లను ఎక్కువగా నమలడం వల్ల చిగుళ్లకు గాయాలు కావచ్చని, రోజుకు ఒక్కసారి మాత్రమే ఉపయోగించడం మంచిదని సూచిస్తున్నారు. అలాగే శుభ్రమైన, తాజా వేప పుల్లను మాత్రమే వినియోగించాలని చెబుతున్నారు. ఆధునిక దంత సంరక్షణతో పాటు వేప పుల్లను పరిమితంగా అలవాటు చేసుకుంటే దంత ఆరోగ్యం మెరుగ్గా ఉండే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# నిమ్మరసం..శరీరానికి తాజాదనం ఇచ్చే సహజ పానీయం

**జనం వాయిస్, ఆరోగ్యం:**

వేసవిలోనే కాదు ఏడాది పొడవునా ఉపయోగం నిమ్మరసం అంటే చాలామందికి ముందుగా వేసవే గుర్తుకు వస్తుంది. కానీ నిమ్మరసం కేవలం దాహం తీర్చే పానీయం మాత్రమే కాదని, ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేసే సహజ పానీయమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇంట్లో సులభంగా తయారుచేసుకోగలిగే నిమ్మరసం తక్కువ ఖర్చుతో శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తుందని వారు పేర్కొంటున్నారు. రోజువారీ జీవనశైలిలో నిమ్మరసాన్ని భాగం చేసుకుంటే శరీరం చురుకుగా ఉంటుందని సూచిస్తున్నారు.



**- విటమిన్‌సి తో రోగనిరోధక శక్తి పెంపు**

నిమ్మలో విటమిన్‌సి సమృద్ధిగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. తరచూ జలుబు, దగ్గు వచ్చే వారికి నిమ్మరసం మేలు చేస్తుందని సూచిస్తున్నారు. శరీరంలోని హానికరమైన ఫ్రీ రాడికల్స్‌ను ఎదుర్కొనే యాంటీఆక్సిడెంట్ గుణాలు నిమ్మరసంలో ఉన్నాయని, ఇవి శరీరాన్ని లోపలి నుంచి రక్షిస్తాయని నిపుణుల అభిప్రాయం.

**- జీర్ణక్రియ, బరువు నియంత్రణకు సహాయం**

నిమ్మరసం జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుందని వైద్యులు చెబుతున్నారు. పరికడుపుతో గోరువెచ్చని నీటిలో నిమ్మరసం కలిపి తాగితే పేగులు శుభ్రపడతాయని, మలబద్ధకం సమస్య తగ్గుతుందని సూచిస్తున్నారు. అలాగే నిమ్మరసం ఆకలిని నియంత్రించి అతిగా తినకుండా చేయడంలో తోడ్పడుతుందని, అందుకే బరువు నియంత్రణలో ఉన్నవారికి ఇది ఉపయోగకరమని నిపుణులు పేర్కొంటున్నారు.

**- సరైన మోతాదు, జాగ్రత్తలు అవసరం**

నిమ్మరసం ఆరోగ్యానికి మేలు చేసినప్పటికీ, అతిగా తాగడం మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువ మోతాదులో తీసుకుంటే ఎసిడిటీ, పళ్ల ఎనామెల్ దెబ్బతినే అవకాశం ఉందని చెబుతున్నారు. ఉప్పు, చక్కెర ఎక్కువగా కలపకుండా, సహజంగా లేదా తేనె కొద్దిగా కలిపి తాగడం మంచిదని సూచిస్తున్నారు. ఎసిడిటీ సమస్య ఉన్నవారు పరిమితంగా మాత్రమే నిమ్మరసం తీసుకోవాలని సూచిస్తూ, సరైన మోతాదులో నిమ్మరసాన్ని రోజువారీ ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి తాజాదనం, ఆరోగ్యం రెండూ లభిస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# సైబర్ మోసానికి గురయ్యారా..? డబ్బులు పోయాయా..?

## - అయితే రూ.25 వేల వరకు నష్టపరిహారం వస్తుంది..!

**జనం వాయిస్, బిజినెస్:**

డిజిటల్ చెల్లింపులు ఎంత సౌకర్యవంతంగా ఉన్నాయో.. అంతే స్థాయిలో సైబర్ మోసాల ప్రమాదం కూడా పెరుగుతోంది. ముఖ్యంగా వృద్ధులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు బ్యాంకు అధికారులు, పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులుగా నటిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. కేవైసీ అప్‌డేట్, ఖాతా బ్లాక్ అవుతుందన్న బెదిరింపులు, లింకుల ద్వారా ఓటీపీలు, వ్యక్తిగత వివరాలు లాగేసుకుని నిమిషాల్లోనే బ్యాంకు ఖాతాల నుంచి డబ్బును ఖాళీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డిజిటల్ మోసాల బాధితులకు ఉపశమనం కల్పించే దిశగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ప్రతిపాదన చేసింది. ఫిబ్రవరిలో జరిగిన ద్రవ్య పరపతి విధాన సమావేశంలో చిన్న మొత్తాల సైబర్ మోసాల కేసుల్లో బాధితులకు రూ.25 వేల వరకు నష్టపరిహారం చెల్లించే విధానాన్ని ప్రవేశపెట్టాలని ఆర్‌బీఐ సూచించింది. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడమే ఈ చర్య వెనుక ప్రధాన ఉద్దేశంగా పేర్కొంది. గత కొన్నేళ్లుగా డిజిటల్ మోసాల కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్న సీనియర్ సిటిజన్ల జీవిత పొదుపు క్షణాల్లోనే కొల్లగొట్టబడుతున్న ఘటనలు అనేకం వెలుగులోకి వచ్చాయి. కొందరు మోసానికి గురై తీవ్ర మానసిక వేదనకు లోనై ఆత్మహత్య ప్రయత్నాలు చేసిన సందర్భాలూ ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో చిన్న-విలువ సైబర్




మోసాలపై నష్టపరిహారం ఇవ్వాలన్న ఆర్‌బీఐ ప్రతిపాదన బాధితులకు తక్షణ ఉపశమనం కలిగించే అవకాశముంది. అలాగే బ్యాంకులు, డిజిటల్ చెల్లింపు సంస్థలు వినియోగదారులకు మరింత భద్రత కల్పించే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. డిజిటల్ లావాదేవీలు చేసే వారు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలని, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఎవరికీ తెలియజేయవద్దని, అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# రేపు దేశవ్యాప్తంగా క్యాబ్, బైక్ టాక్సీల సమ్మె.

**జనం వాయిస్, బిజినెస్:**




దేశవ్యాప్తంగా ఓలా, ఉబర్, ర్యాపిడో, పోర్టర్ వంటి యాప్ ఆధారిత రవాణా సేవల డ్రైవర్లు శనివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సమ్మెకు పిలుపునిచ్చారు. అగ్రిగేటర్ సంస్థల ఏకపక్ష విధానాల వల్ల తమ ఆదాయం తీవ్రంగా పడిపోతోందని డ్రైవర్ల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ వంటి మెట్రో నగరాల్లో ఈ సమ్మె ప్రభావం ఎక్కువగా ఉండనుందని అంచనా వేస్తున్నారు. డ్రైవర్ల ఆరోపణల ప్రకారం ప్రస్తుతం అమలులో ఉన్న కనీస ధర విధానం వల్ల ప్రయాణానికి వచ్చే మొత్తంలో డ్రైవర్లకు మిగిలే ఆదాయం గణనీయంగా తగ్గుతోంది. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు, వాహనాల నిర్వహణ ఖర్చులతో పోలిస్తే యాప్ కంపెనీలు చెల్లిస్తున్న రేట్లు ఏమాత్రం సరిపోవడం లేదని వారు వాపోతున్నారు. పైగా అగ్రిగేటర్ సంస్థలు అధిక కమిషన్లు వసూలు చేస్తూ డ్రైవర్లను ఆర్థికంగా నష్టపరుస్తున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ సమస్యలపై కేవలం కంపెనీలే కాదు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తక్షణమే జోక్యం చేసుకోవాలని డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక నిబంధనలు రూపొందించాలని, ధరల నిర్ణయంలో పారదర్శకత తీసుకురావాలని కోరుతున్నారు. తమ డిమాండ్ల పరిష్కారం కాకపోతే భవిష్యత్తులో నిరసనలు మరింత ఉధృతం చేస్తామని డ్రైవర్ల సంఘాల నేతలు హెచ్చరించారు.

# క్రిప్టో మార్కెట్‌లో కలకలం..
# బిట్‌కాయిన్ భారీగా పతనం..
# 65000 డాలర్ల దిగువకు..!



**జనం వాయిస్, బిజినెస్:**

ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టో కరెన్సీగా పేరున్న బిట్‌కాయిన్ విలువ శుక్రవారం ఒక్కసారిగా భారీగా పడిపోయింది. ఒకే రోజులో సుమారు 12 శాతం క్షీణించి 65000 డాలర్ల దిగువకు చేరింది. గత ఏడాది కాలంలో ఇదే అత్యల్ప స్థాయి కావడం గమనార్హం. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ స్థాయిలో బిట్‌కాయిన్ పడిపోవడం ఇదే తొలిసారి అని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. క్రిప్టో మార్కెట్‌లో భయాందోళన వాతావరణం నెలకొనడంతో ఇన్వెస్టర్లు ఒక్కసారిగా అమ్మకాల వైపు మొగ్గు చూపారు. దీంతో బిట్‌కాయిన్ ధర 64352 డాలర్ల స్థాయికి చేరింది. ఏడాది వ్యవధిలో చూస్తే బిట్‌కాయిన్ విలువ దాదాపు 33 శాతం వరకు తగ్గింది. గడిచిన 24 గంటల్లోనే దాదాపు 1 బిలియన్ డాలర్ల విలువైన బిట్‌కాయిన్ మార్కెట్ నుంచి బయటకు వెళ్లినట్లు అంచనా వేస్తున్నారు. గత ఏడాది అక్టోబర్ నెలలో బిట్‌కాయిన్ ధర చరిత్రలోనే అత్యధికంగా 126000 డాలర్లను తాకింది. అక్కడి నుంచి చూస్తే ప్రస్తుతం ధర దాదాపు సగానికి పడిపోయినట్టే. ప్రస్తుతం బిట్‌కాయిన్ మొత్తం మార్కెట్ విలువ సుమారు 1.28 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. గడిచిన 24 గంటల్లో మొత్తం క్రిప్టో మార్కెట్ విలువ కూడా గణనీయంగా తగ్గినట్లు నివేదికలు చెబుతున్నాయి. బిట్‌కాయిన్ ప్రభావంతో ఇతర క్రిప్టో కరెన్సీలూ నష్టాల్లోనే ట్రేడవుతున్నాయి. టెథర్ ధర దాదాపు స్థిరంగా ఉండగా, బైనాన్స్ కాయిన్, ఎక్స్‌ఆర్‌పి, సోలానా, డాగ్‌కాయిన్ వంటి కాయిన్లు కూడా గణనీయంగా పడిపోయాయి. ముఖ్యంగా చిన్న కాయిన్లలో భారీగా అమ్మకాలు నమోదవుతున్నట్లు తెలుస్తోంది. క్రిప్టో మార్కెట్‌లో ఇటీవలి కాలంలో భారీ ఊగిసలాటలు కొనసాగుతున్న నేపథ్యంలో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు. కీలక సపోర్ట్ స్థాయిల వద్ద మార్కెట్ ఎలా స్పందిస్తుందో గమనిస్తూ పెట్టుబడులపై నిర్ణయాలు తీసుకోవాలని, ఒక్కసారిగా భావోద్వేగాలకు లోనై ట్రేడింగ్ చేయడం ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు.

# క్రీడలు

దినమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక
RNI NO:TGTEL/26/A0383
WWW.JANAMVOICE.COM




## అండర్19 ఫైనల్లో సూర్యవంశీ తుఫాన్ శతకం..

**జనం వాయిస్, స్పోర్ట్స్:**

అండర్19 ప్రపంచకప్ 2026 ఫైనల్‌లో భారత యువ జట్టు పరుగుల వరద సృష్టిస్తోంది. హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న తుది పోరులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ భారీ స్కోరు దిశగా దూసుకెళ్తోంది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ అద్భుత ఫామ్‌లో చెలరేగుతూ కేవలం 55 బంతుల్లోనే శతకం సాధించి ఇంగ్లండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఇన్నింగ్స్ ఆరంభంలో 20 పరుగుల వద్ద ఓపెనర్ ఆరోన్ జార్జ్ వికెట్‌ను కోల్పోయిన భారత్ కాస్త తడబడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన వైభవ్ సూర్యవంశీ కెప్టెన్ ఆయుష్ మాత్రేతో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఇంగ్లండ్ బౌలర్లపై దూకుడుగా ఆడిన ఈ జోడీ రెండో వికెట్‌కు 142 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. కెప్టెన్ ఆయుష్ 53 పరుగులతో ఔటైనా.. మరోవైపు వైభవ్ మాత్రం పరుగుల వరద పారించాడు. బౌండరీల మోత మోగిస్తూ మైదానం నలువైపులా షాట్లు సంధించిన వైభవ్ సూర్యవంశీ ప్రత్యర్థి బౌలర్లను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టాడు. ఆరు ఓవర్ల పవర్‌ప్లే నుంచే వేగం పెంచిన అతడు స్ట్రైక్ రేట్ దాదాపు 190కి చేరేలా బ్యాటింగ్ చేశాడు. ఇంగ్లండ్ బౌలర్లలో అలెక్స్ గ్రీన్ రెండు వికెట్లు పడగొట్టినప్పటికీ.. మిగతా బౌలర్లు వైభవ్ ధాటికి తట్టుకోలేకపోయారు. తాజా సమాచారం ప్రకారం 22 ఓవర్లలో భారత్ రెండు వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. వైభవ్ సూర్యవంశీ సెంచరీ దాటిన తర్వాత కూడా దూకుడును కొనసాగిస్తూ భారీ స్కోరు దిశగా జట్టును తీసుకెళ్తున్నాడు. ఇంకా చాలా ఓవర్లు మిగిలి ఉండటంతో భారత్ మూడువందల యాభై పరుగులకు పైగా స్కోరు సాధించే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

## టీ20 ప్రపంచకప్ 2026.. అందరి కళ్లూ ఈ 10 మంది ఆటగాళ్లపైనే!

**జనం వాయిస్, స్పోర్ట్స్:**

రేపటి నుంచి భారత్, శ్రీలంక సంయుక్త ఆతిథ్యంలో ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభం కానుంది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ మెగా టోర్నీలో ఈసారి పిచ్‌ల స్వభావం కూడా కీలక పాత్ర పోషించనుంది. భారత్‌లో బ్యాటింగ్‌కు అనుకూలమైన మైదానాల్లో పరుగుల వరద పారే అవకాశం ఉండగా, శ్రీలంకలో నెమ్మదైన వికెట్లపై స్పిన్నర్లు మ్యాచ్‌లను శాసించే పరిస్థితి కనిపిస్తోంది. పొట్టి ఫార్మాట్‌లో పవర్‌ప్లేలో దూకుడు, మిడిల్ ఓవర్లలో నియంత్రణ, డెత్ ఓవర్లలో ఒత్తిడిని జయించే సామర్థ్యమే మ్యాచ్ ఫలితాన్ని తేల్చనుంది. గత ప్రపంచకప్‌లను పరిశీలిస్తే.. కొద్దిమంది ఆటగాళ్ల అద్భుత ప్రదర్శనలే టోర్నీ దిశను మార్చేశాయి. ఈ నేపథ్యంలో ఈసారి ప్రపంచకప్‌లో ప్రత్యేకంగా గమనించాల్సిన 10 మంది కీలక ఆటగాళ్లపై అందరి దృష్టి నెలకొంది. భారత జట్టు నుంచి అభిషేక్ శర్మ పవర్‌ప్లేలో విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రత్యర్థులను ఒత్తిడిలోకి నెట్టగలడు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా అనుభవంతో కీలక క్షణాల్లో జట్టుకు ఆధారంగా నిలుస్తాడు. వరుణ్ చక్రవర్తి తన స్పిన్‌తో మధ్య ఓవర్లలో మ్యాచ్‌ను మలుపుతిప్పే శక్తి కలిగిన బౌలర్‌గా నిలుస్తున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా డెత్ ఓవర్లలో తన యార్కర్లు, వెరైటీ బంతులతో ఏ బ్యాటింగ్ లైనప్‌నైనా కట్టడి చేయగల సామర్థ్యం కలిగి ఉన్నాడు. అంతర్జాతీయ స్థాయిలో ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ దూకుడైన బ్యాటింగ్‌తో ప్రత్యర్థి ప్రణాళికలను భగ్నం చేయగలడు. శ్రీలంక స్పిన్ సంచలనం వనిందు హసరంగ స్వదేశీ పిచ్‌లపై అత్యంత ప్రమాదకరంగా మారనున్నాడు. దక్షిణాఫ్రికా వికెట్ కీపర్ బ్యాటర్ క్వింటన్ డి కాక్ పవర్‌ప్లేలో మ్యాచ్‌ను తన వైపుకు తిప్పే ఆటగాడు. ఇంగ్లండ్ తరఫున ఫిల్ సాల్ట్ దూకుడైన ఆటతో బౌలర్లకు కంటిమీద కునుకు లేకుండా చేయగలడు. ఆఫ్ఘనిస్థాన్ జట్టుకు రషీద్ ఖాన్ బౌలింగ్‌లో వెన్నెముకగా నిలవగా, అజ్మతుల్లా ఒమర్జాయ్ బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ కీలక పాత్ర పోషించనున్నాడు.మొత్తం మీద ఈ టీ20 ప్రపంచకప్ శక్తి, వ్యూహాల మధ్య సాగే ఉత్కంఠభరిత పోరుగా మారనుంది. ఈ 10 మంది ఆటగాళ్ల ప్రదర్శన టోర్నీ గమనాన్ని శాసించే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో, అభిమానులందరి చూపు వీరిపైనే నిలిచింది






## ఆస్ట్రేలియాకు బిగ్ షాక్. స్టార్ పేసర్ ఔట్

**జనం వాయిస్, స్పోర్ట్స్:**

టీ20 ప్రపంచకప్‌కు ముందు ఆస్ట్రేలియా జట్టుకు మరో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. గాయంతో బాధపడుతున్న జోష్ హేజిల్‌వుడ్ టోర్నమెంట్ మొత్తానికి దూరమయ్యాడు. ఇప్పటికే ప్యాట్ కమిన్స్ గాయంతో బయటకు వెళ్లగా మిచెల్ స్టార్క్ రిటైర్మెంట్ తీసుకున్న నేపథ్యంలో కీలక పేస్ బౌలర్లు లేకుండానే ఆస్ట్రేలియా బరిలోకి దిగాల్సి వస్తోంది. సూపర్ ఎనిమిది దశకు వచ్చే సరికి హేజిల్‌వుడ్ కోలుకుంటాడని యాజమాన్యం తొలుత ఆశించింది. కానీ తాజా వైద్య నివేదికల ప్రకారం అతడు పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్ సాధించడానికి ఇంకా సమయం పడనుంది. తొందరపడి మైదానంలోకి దింపితే గాయం మళ్లీ ముదిరే ప్రమాదం ఉందని జట్టు వైద్య బృందం హెచ్చరించింది. ఈ నేపథ్యంలో హేజిల్‌వుడ్‌ను పక్కన పెట్టాలని సెలెక్టర్లు నిర్ణయం తీసుకున్నారు. ఈ అంశంపై జాతీయ సెలక్టర్ మాట్లాడుతూ ఆటగాడి ఆరోగ్యం ప్రధానమని స్పష్టం చేశారు. పూర్తిగా కోలుకోకుండా ఆడించడం వల్ల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని, అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం అతడి స్థానంలో కొత్త ఆటగాడిని చేర్చే అంశంపై తుది నిర్ణయం తీసుకోలేదని, అవసరాన్ని బట్టి తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఇదే సమయంలో కెప్టెన్ స్పందిస్తూ జట్టులో ప్రతిభావంతులైన సీమర్లకు కొదవలేదని ధీమా వ్యక్తం చేశాడు. ఆల్‌రౌండర్లు బౌలింగ్ బాధ్యతలు భుజాన వేసుకునే స్థాయిలో ఉన్నారని, పరిస్థితులకు అనుగుణంగా జట్టును సమతూకంగా సిద్ధం చేస్తామని అన్నాడు. కీలక పేస్ బౌలర్లు లేకపోయినా సమిష్టి ప్రదర్శనతో ముందుకు వెళ్లాలని జట్టు లక్ష్యంగా పెట్టుకుంది.






## వైభవ్ శతక విధ్వంసం.. నాలుగొందలు కొట్టిన టీమిండియా..!

**జనం వాయిస్, స్పోర్ట్స్:**

అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో భారత యువ జట్టు బ్యాటర్లు ఇంగ్లండ్ బౌలర్లపై విధ్వంసం సృష్టించారు. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన శతకంతో భారత ఇన్నింగ్స్‌కు పునాది వేశాడు. ఆరంభంలో ఆరోన్ జార్జ్ త్వరగానే వెనుదిరిగినా, వైభవ్ ఆకాశమే హద్దుగా చెలరేగి బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 55 బంతుల్లోనే శతకం పూర్తి చేసిన అతడు, ఇన్నింగ్స్ మొత్తం మీద 175 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లకు వెన్నులో వణుకు పుట్టించాడు.వైభవ్‌కు కెప్టెన్ ఆయుష్ మాత్రే బాధ్యతాయుతమైన అర్ధ శతకంతో చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరి భాగస్వామ్యం జట్టును భారీ స్కోర్ దిశగా నడిపించింది. వైభవ్ వెనుదిరిగిన తర్వాత విహాన్ మల్హోత్రా, వేదాంత్ త్రివేది కీలక భాగస్వామ్యంతో స్కోర్‌బోర్డును ముందుకు నడిపించారు. మధ్య ఓవర్లలో కొద్దిసేపు స్కోరింగ్ రేటు తగ్గినప్పటికీ, చివరి దశలో అభిగ్యాన్ కుందు వేగంగా పరుగులు రాబట్టుతూ ఇన్నింగ్స్‌కు మళ్లీ ఊపు తెచ్చాడు.డెత్ ఓవర్లలో కనిష్క్ చౌహాన్ మెరుపు ఇన్నింగ్స్‌తో టీమిండియాను నాలుగు వందల పరుగుల మైలురాయికి చేర్చాడు. చివరి ఓవర్లలో వరుస బౌండరీలతో స్కోర్‌ను మరింత పెంచడంతో భారత జట్టు ప్రత్యర్థికి 412 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.ఫైనల్ వంటి కీలక మ్యాచ్‌లో టాప్ ఆర్డర్ నుంచి టెయిల్ ఎండ్ వరకు బ్యాటర్లు సమిష్టిగా రాణించడంతో భారత్ ఘనమైన స్థితిలో నిలిచింది. ఇప్పుడు ఇంగ్లండ్ ముందు ఈ భారీ లక్ష్యాన్ని చేధించడం ఎంతటి కఠినమైన సవాలుగా మారుతుందో చూడాల్సిందే.

# త్రిష, నయనతార.. ఇరవై ఏళ్ల క్రేజ్‌కి విలువ ఎంత.. ఎవరు నిజంగా రిచ్..?



**జనం వాయిస్, సినిమా:**

దక్షిణాది సినీ పరిశ్రమలో దాదాపు రెండు దశాబ్దాలుగా టాప్ హీరోయిన్లుగా కొనసాగుతున్న త్రిష కృష్ణన్, నయనతార క్రేజ్ ఇప్పటికీ ఏమాత్రం తగ్గలేదు. వరుసగా కొత్త తరం హీరోయిన్లు వస్తున్నా.. వీరిద్దరూ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఇండస్ట్రీలో బిజీగా కొనసాగుతున్నారు. ఇటీవల నయనతార నటించిన తాజా చిత్రం ప్రేక్షకుల ముందుకు రావడంతో మరోసారి ఆమె క్రేజ్ గురించి చర్చ మొదలైంది. కొన్నేళ్లుగా వీరిద్దరి మధ్య కోల్డ్ వార్ ఉందన్న ప్రచారం ఉన్నప్పటికీ.. ఇటీవల కలిసి వెకేషన్ ఎంజాయ్ చేసిన ఫోటోలు బయటకు రావడంతో ఆ అపోహలకు తెరపడింది. త్రిష కృష్ణన్ చెన్నైలో జన్మించి మోడలింగ్ రంగం ద్వారా సినిమాల్లోకి అడుగుపెట్టింది. తొలుత చిన్న పాత్రలతో మొదలుపెట్టిన ఆమె తరువాత కథానాయికగా ఎదిగి తెలుగు, తమిళం భాషల్లో వరుస హిట్ చిత్రాలతో స్టార్‌డమ్ సంపాదించింది. కొన్నాళ్లు కెరీర్‌లో నెమ్మదించినప్పటికీ.. భారీ ప్రాజెక్ట్‌తో రీఎంట్రీ ఇచ్చి మళ్లీ బిజీ హీరోయిన్‌గా మారింది. దాదాపు యాభైకి పైగా చిత్రాల్లో నటించిన త్రిష ఒక్కో సినిమాకు సుమారు ఐదు కోట్ల రూపాయల వరకు పారితోషికం తీసుకుంటున్నట్లు సమాచారం. బ్రాండ్ ప్రచారాల ద్వారా కూడా ఏటా కోట్లలో ఆదాయం పొందుతోంది. రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టిన త్రిష ఆస్తులు సుమారు ఎనభై అయిదు కోట్ల రూపాయల వరకు ఉన్నట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇక నయనతార విషయానికి వస్తే.. మలయాళ చిత్రంతో అరంగేట్రం చేసిన ఆమె తెలుగు, తమిళ పరిశ్రమల్లో లేడీ సూపర్‌స్టార్ స్థాయికి ఎదిగింది. కథానాయికగా మాత్రమే కాకుండా మహిళా కేంద్రిత చిత్రాల్లోనూ కీలక పాత్రలు పోషిస్తూ తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను ఏర్పరుచుకుంది. ఇటీవల బ్లాక్‌బస్టర్ విజయం అందుకోవడంతో ఆమె మార్కెట్ విలువ మరింత పెరిగింది. ఒక్కో సినిమాకు సుమారు పది కోట్ల రూపాయల వరకు పారితోషికం తీసుకుంటున్న నయనతార.. తన భర్తతో కలిసి నిర్మాణ సంస్థను ప్రారంభించి వ్యాపార రంగంలోనూ అడుగుపెట్టింది. సినిమా నిర్మాణం, బ్రాండ్ ఎండార్స్మెంట్లు, కాస్మోటిక్స్ వ్యాపారాల ద్వారా ఆమె సంపద భారీగా పెరిగింది. సినీ వర్గాల సమాచారం ప్రకారం నయనతార ఆస్తులు దాదాపు రెండువందల కోట్ల రూపాయల వరకు ఉన్నట్లు అంచనా. ఇలా చూస్తే సంపద పరంగా నయనతార ముందంజలో ఉండగా.. కెరీర్ పరంగా మాత్రం త్రిష, నయనతార ఇద్దరూ దాదాపు సమానమైన స్థాయిలో విజయవంతంగా కొనసాగుతున్నారు. ఇరవై ఏళ్లుగా టాప్ హీరోయిన్లుగా నిలబడటం వీరిద్దరికీ సాధ్యమైన అరుదైన ఘనతగా సినీ అభిమానులు అభివర్ణిస్తున్నారు

## మెగానందమూరి స్నేహానికి మరో నిదర్శనం. చరణ్ కవల పిల్లలకు బాలయ్య ప్రత్యేక కానుకలు!



**జనం వాయిస్, సినిమా:**

సినీ అభిమానుల మధ్య ఎంత పోటీ, వాగ్వాదాలు ఉన్నప్పటికీ టాలీవుడ్ ఇండస్ట్రీకి చెందిన మెగా ఫ్యామిలీ, నందమూరి కుటుంబాల మధ్య అనుబంధం ఎప్పుడూ ప్రత్యేకంగానే నిలుస్తోంది. స్టార్ హీరోలు చిరంజీవి, నందమూరి బాలకృష్ణ మధ్య ఉన్న స్నేహం తరచూ పలు సందర్భాల్లో బయటపడుతూనే ఉంటుంది. తాజాగా రామ్ చరణ్ ఉపాసన దంపతులకు కవల పిల్లలు జన్మించడంతో ఈ రెండు కుటుంబాల మధ్య ఉన్న సాన్నిహిత్యం మరోసారి చర్చకు వచ్చింది. కొద్ది రోజుల క్రితం రామ్ చరణ్, ఉపాసన దంపతులకు కవల పిల్లలు పుట్టిన విషయం తెలిసిందే. చిరంజీవి ఎప్పటినుంచో మనవడిని చూడాలని కోరుకుంటుండగా, ఈసారి ఒక బాబు మాత్రమే కాకుండా మరో పాప కూడా పుట్టడంతో మెగా ఫ్యామిలీలో ఆనందం రెట్టింపైంది. ఈ శుభవార్త తెలుసుకున్న నందమూరి బాలకృష్ణ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేసినట్లు సమాచారం. రామ్ చరణ్ దంపతులకు బాలకృష్ణ తరఫున ఒక అందమైన పూల బొకేతో పాటు శ్రీ వెంకటేశ్వరస్వామి ఫోటో, తిరుమల ప్రసాదం, పిల్లల కోసం బొమ్మలు, గిఫ్ట్ హ్యాంపర్లు పంపినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. గతంలో కూడా మెగా కుటుంబంలో శుభకార్యాలు జరిగినప్పుడల్లా బాలయ్య నుంచి బహుమతులు చేరిన సందర్భాలు ఉన్నాయని ఇండస్ట్రీలో చర్చ సాగుతోంది. ఇండస్ట్రీలో ఒక ప్రత్యేక సెంటిమెంట్ కూడా ఉంది. ఏదైనా మంచి పని లేదా శుభకార్యం ముందు నందమూరి బాలకృష్ణ నుంచి ఆశీర్వాదాలు లేదా బహుమతులు అందితే అది మంచి సూచికగా భావిస్తారనే నమ్మకం చాలాకాలంగా ఉంది. అందుకే తనకు ఆప్తులైన వారికి, స్నేహితులకు బాలయ్య స్వయంగా గుర్తుంచుకుని గిఫ్ట్‌లు పంపుతుంటారని సినీ వర్గాలు చెబుతున్నాయి. 'అన్‌స్టాపబుల్' టాక్ షోలో బాలకృష్ణ రామ్ చరణ్ మధ్య కనిపించిన స్నేహపూర్వకత అప్పట్లో అభిమానులను ఆకట్టుకుంది. ఫ్యాన్ వార్స్ ఎంత ఉన్నా స్టార్ కుటుంబాల మధ్య వ్యక్తిగత సంబంధాలు ఎంత బలంగా ఉంటాయో ఆ సందర్భం స్పష్టంగా చూపించింది. సినిమాల విషయానికి వస్తే చిరంజీవి నటించిన తాజా చిత్రం సంక్రాంతి విన్నర్‌గా నిలవగా, రామ్ చరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రంలో నటిస్తున్నారు. మరోవైపు పవన్ కళ్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' విడుదలకు సిద్ధమవుతోంది. ఇలా మెగా ఫ్యామిలీ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న వేళ, కుటుంబంలో కవల పిల్లల రాకతో ఆనందం మరింత పెరిగినట్టుగా కనిపిస్తోంది.

# 13 ఏళ్లుగా ఒక్క సినిమా చేయలేదు..

**- కానీ 4600 కోట్లకు మహారాణి.**
**- ఆమె కోసం స్టార్ హీరోలే వెయిట్ చేశారు..!**

**జనం వాయిస్, సినిమా:**

ఒకప్పుడు భారతీయ సినీ ప్రపంచంలో టాప్ హీరోయిన్‌గా వెలుగొందిన నటి జూహి చావ్లా ఇప్పుడు సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ సంపద పరంగా దేశంలోనే అత్యంత ధనిక నటీమణుల్లో ఒకరిగా నిలుస్తోంది. చిన్న వయసులోనే నటిగా అడుగుపెట్టిన ఆమె అప్పట్లో యూత్ ఫేవరేట్ క్రష్‌గా మారింది. స్టార్ హీరోలతో వరుసగా నటిస్తూ బ్లాక్‌బస్టర్ విజయాలు అందుకున్న జూహి చావ్లా కోసం ఒకప్పుడు హీరోలే క్యూ కట్టే పరిస్థితి ఉండేది. 1986లో ధర్మేంద్ర నటించిన చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసిన జూహి చావ్లాకు 1988లో ఆమిర్ ఖాన్‌తో కలిసి చేసిన చిత్రం పెద్ద గుర్తింపును తెచ్చిపెట్టింది. ఆ తర్వాత హిందీతో పాటు ఇతర భాషల్లోనూ వరుస చిత్రాల్లో నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొంభైయవ దశకంలో ఆమెకు ఉన్న క్రేజ్ వేరే స్థాయిలో ఉండేది. అయితే కెరీర్ మంచి ఊపులో ఉన్నప్పుడే వివాహం చేసుకుని, క్రమంగా సినిమాలకు దూరమైంది. గత పదమూడు సంవత్సరాలుగా ఆమె ఒక్క హిట్ సినిమాలోనూ నటించలేదు. ఇటీవలి సంవత్సరాల్లో థియేటర్లలో విడుదలైన చిత్రాల్లో ఆమె కనిపించకపోవడంతో అభిమానులు కూడా ఆశ్చర్యపోతున్నారు. అయినప్పటికీ సినీరంగానికి దూరంగా ఉన్నా జూహి చావ్లా ఆర్థికంగా అత్యంత బలమైన స్థాయికి చేరుకుంది. హురున్ రిచ్ లిస్ట్ నివేదికల ప్రకారం ఆమె సంపద సుమారు 4600 కోట్ల రూపాయల వరకు ఉందని సమాచారం. సినిమాల ద్వారా వచ్చే ఆదాయం కంటే వ్యాపారాలు, పెట్టుబడుల ద్వారానే ఆమెకు ప్రధానంగా సంపాదన వస్తోంది. రియల్ ఎస్టేట్ రంగంలో భారీ పెట్టుబడులు పెట్టడంతో పాటు క్రికెట్ జట్లలోనూ భాగస్వామిగా ఉంది. షారుఖ్ ఖాన్‌తో కలిసి కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టులో పెట్టుబడి పెట్టిన ఆమెకు ఆ జట్టు విలువ పెరుగుతున్న కొద్దీ సంపద కూడా పెరుగుతోంది. అదేవిధంగా సినిమా నిర్మాణ సంస్థల్లో భాగస్వామ్యం, ఇతర వ్యాపారాలు కూడా ఆమె సంపద పెరుగుదలకు కారణమయ్యాయి. ముంబై, గుజరాత్ ప్రాంతాల్లో ఖరీదైన బంగ్లాలు, రెస్టారెంట్లు ఉండటంతో పాటు విలాసవంతమైన కార్ల కలెక్షన్ కూడా ఆమె వద్ద ఉంది. సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ జూహి చావ్లా జీవితం మాత్రం విలాసవంతంగా కొనసాగుతోంది. ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా వెలుగొందిన



ఈ నటి ఇప్పుడు వ్యాపారవేత్తగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకోవడం సినీ ప్రపంచంలో ఆసక్తికర అంశంగా మారింది

Printed, Published and Owned by **GATTU MAHESH,** Printed at **M R PUBLICATIONS,** # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, **EDITOR: GATTU MAHESH, DYNAMIC JANAMVOICE PUBLICATIONS, 2-80/A,** VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. **RNI NO: TGTEL/26/A0383,** CELL: 8008398069, MAIL ID: honeyassociatesmnt@gmail.com